సాక్షి
తిరుపతి
మంగళవారం। 15 । ఆగస్టు । 2023



అభివృద్ధే మా అజెండా

పుంగనూరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే అజెండా అని ఎంపీ మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. - IIలో



స్పందన అర్జీలకు ప్రాధాన్యత

స్పందన అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ డీ కే బాలాజి అధికారులను ఆదేశించారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	25
చిత్తూరు	36	25
తిరుమల	32	21
గూడూరు	38	28
నగరి	37	26

న్యూస్‌రీల్

తొలి విడతలో వందశాతం పంపిణీ



జయలక్ష్మి

తిరుపతి అర్బన్: జిల్లాలోని బాలింతలు, గర్భిణులకు వందశతం టేక్ హోం రేషన్ పంపిణీ చేశామని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయలక్ష్మి పేర్కొన్నారు. ఆమె సోమవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,482 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ స్కూల్స్ పరిధిలో 12,290 మంది బాలింతలు, 12,538 మంది గర్భిణులున్నారని వివరించారు. వీరందరికీ 15 కిలోల బ్యాగ్‌లో 10 రకాల వస్తువులను ఆగస్టు నెలకు సంబంధించి మొదటి 15 రోజుల్లో (తొలి విడతలో) ఇవ్వాల్సిన కిట్ అందజేసినట్లు వెల్లడించారు. ఈ నెలలో రెండో దశగా 15 నుంచి 30 తేదీలోపు ఇవ్వాల్సిన కిట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో ప్రారంభించి వారం రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలియజేశారు.

నేడు మద్యం దుకాణాలు మూసివేత



జానకిరామ్

తిరుపతి అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం మద్యం దుకాణాలు మూసివేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జానకిరామ్ వెల్లడించారు. ఆయన సోమవారం కలెక్టరేట్ నుంచి మాట్లాడుతూ మద్యం దుకాణాలతోపాటు బార్లు, హోటళ్లువంటివన్నీ మూసేయాలని ఆదేశించారు. అంతేకాకుండా కల్లు దుకాణాలు సైతం మూత వేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా ప్రతి ఒక్కరూ పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

తుడా చైర్మన్‌గా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మూడేళ్ల పాటు పదవిలో
- ఇక అధికార హోదాతో ప్రజల్లోకి..



తిరుపతి రూరల్/తిరుపతి తుడా: వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మరింతగా ప్రజలకు చేరువచేసేందుకు, మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించేలా ప్రోత్సాహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(తుడా) చైర్మన్‌గా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని నియమించారు. ఆమేరకు సోమవారం ప్రత్యేక జీవోను విడుదల చేశారు. మూడేళ్ల పాటు మోహిత్‌రెడ్డి ఈ పదవిలో ఉంటారు.

అధికార హోదాలో ప్రజల వద్దకు..

సౌమ్యుడుగా, వివాదరహితుడుగా చంద్రగిరి నియోజకవర్గంలో దాదాపు 108 సచివాలయాల పరిధిలో 2,266 పల్లెల్లో 1600 కిలోమీటర్ల మేర మోహిత్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్నారు. ప్రజలతో మమేకం అవుతూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడి అక్కడే పరిష్కరించేలా చొరవచూపుతున్నారు. పలు సమస్యలకు నిధుల కొరత ఉంటే అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయిస్తూ వాటిని పరిష్కరిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. ఈనేపథ్యంలో ఎలాంటి ప్రొటోకాల్ లేకుండా నియోజకవర్గ వ్యాప్తంగా మోహిత్‌రెడ్డి ఎలా పర్యటిస్తారని, నిధుల మంజూరు, సమస్యల పరిష్కారం ఎలా చేస్తారని టీడీపీ శ్రేణులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశాయి. మోహిత్‌రెడ్డి పర్యటనల్లో అధికారులు ఎలా పాల్గొంటారని, మీడియా సమావేశాలు పెట్టి మరీ విమర్శలు చేశారు. ప్రొటోకాల్ లేకుండా చంద్రగిరి ప్రజల వద్దకు అధికారులతో కలిసి ప్రజల వద్దకు వెళ్లడంపై ప్రతిపక్షాల చేసిన విమర్శలు, ఫిర్యాదులు ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లాయి. మోహిత్‌రెడ్డిని మరింత ప్రోత్సాహించేందుకు నిర్ణయించుకున్న ముఖ్యమంత్రి, ప్రతి నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు పాదయాత్ర చేస్తూ ప్రజల్లో ఉంటున్న మోహిత్‌రెడ్డి, ప్రజా సమస్యలు విని, వాటిని అధికారులతో చర్చించి పరిష్కరించేలా అధికార హోదాను కల్పించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో మోహిత్‌రెడ్డిని తుడా చైర్మన్‌గా నియమించారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికార హోదాలో పాల్గొనేందుకు, అధికారులతో చర్చించి ప్రజలకు మరింత మేలు చేసేందుకు మోహిత్‌రెడ్డికి అవకాశం దక్కిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాయి.

4 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

– ఒక సర్పంచ్, 7 వార్డు సభ్యుల స్థానాలకే ఎన్నికలు

ఏకగ్రీవమైన పంచాయతీలు

- వెంకటగిరి మండలం పాళ్లెం కోట
- రామచంద్రాపురం మండలం కమ్మకండ్రిగ
- తొట్టంబేడు మండలం పెన్నలపాడు
- ఏర్పేడు మండలం పెనుమల్లం

తిరుపతి అర్బన్: జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ అయిన 5 సర్పంచ్, 41 వార్డు సభ్యుల స్థానాలకు గాను నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఒక సర్పంచ్, 7 వార్డు సభ్యుల స్థానాలకు మాత్రమే పోటీ ఖరారైంది. ఈ ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం ఈ నెల 8వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ క్రమంలో 5 సర్పంచ్ స్థానాలకు 15, 41 వార్డు సభ్యుల స్థానాలకుగాను 80 నామినేషన్లు వచ్చాయి. అయితే సోమవారం నామినేషన్ల ఉపసంహరణ నేపథ్యంలో పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు గ్రామ సర్పంచ్ స్థానం మాత్రం బరిలో మిగిలింది. మొత్తం 41 వార్డు సభ్యులకుగాను 7చోట్ల మినహా మిగిలిన అన్ని చోట్ల నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ నెల 19వ తేదీ ఒక సర్పంచ్ స్థానానికి, 7 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి సోమవారం తెలియజేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో సుమారు అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,401 మంది స్వామివారిని దర్శించుకోగా, 37,738 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.76 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భక్తుల భద్రతపైనే ‘ఫోకస్’

- ఓ వైపు అటవీశాఖ.. మరో వైపు టీటీడీ
- సంపూర్ణ రక్షణకు ప్రణాళిక రూపకల్పన
- క్రూర మృగాల కదలికలపై నిఘా
- తిరుపతిలో హైలెవల్ కమిటీ సమావేశం



ఉన్నత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

సాక్షి, తిరుపతి : భక్తుల భద్రతే లక్ష్యంగా టీటీడీ, అటవీ అధికారులు ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఫోకస్ లైట్లు, కెమెరాలు వంటివి విస్తృతంగా ఏర్పాటు చేయనున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల ప్రాణాలకు ఎటువంటి ఆపదా తలెత్తకుండా చర్యలు చేపట్టారు. చిన్నారి లక్షిత మృతితో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన సోమవారం హైలెవల్ కమిటీ సమావేశం నిర్వహించారు. మరో వైపు అటవీశాఖ అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియ పాండే ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఇంకో వైపు టీటీడీ పోలీసుశాఖ అధికారులతో సమావేశమైంది. ఆ తరువాత టీటీడీ, అటవీశాఖ అధికారులు కలిసి సమావేశమయ్యారు. నెలన్నర క్రితం నడక దారిలో ఆరేళ్ల బాలుడు కౌశిక్‌పైనా, రెండు రోజుల క్రితం లక్షితపైనా చిరుత దాడి చేయడానికి గల కారణాలు, నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్తులో కాలినడకన, ఘాట్ రోడ్డులో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉమ్మడిగా ప్రణాళికలు రూపొందించారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత చిన్నపిల్లలకు అనుమతి ఉండదు. పెద్దలకు మాత్రం రాత్రి పది గంటల వరకు అనుమతి ఉంటుంది. నడక మార్గంలో వెళ్లే ప్రతి భక్తుడికి ఊతకర్ర చేతికి ఇచ్చి పంపాలని నిర్ణయం తీసుకున్నారు. అలిపిరి నుంచి ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే అనుమతి ఉంటుంది.

భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు

భక్తుల భద్రత దష్ట్యా టీటీడీ, అటవీ శాఖా భారీ ఎత్తున భద్రతా సిబ్బందిని నియమించాలని నిర్ణయం తీసుకున్నాయి. ట్రాప్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఉపయోగించనున్నారు. నడక దారిలో అవసరమైతే ఫోకస్ లైట్స్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలిపిరి, ఏడవ మైలు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. మెడికల్ క్యాంపులు, బేస్ క్యాంపులు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించనున్నారు. నడక మార్గంలో భక్తులను గుంపులుగా పంపే ఏర్పాట్లు ప్రారంభించారు. నడక, ఘాట్ మార్గాల్లో జంతువులకు తినుబండారాలు ఇవ్వకుండా చర్యలు చేపట్టారు.

క్రూర మృగాల కదలికలపై నిఘా

శేషాచలం అడవిలో క్రూర మృగాల కదలికలపై అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో నిఘా పెట్టారు. టీటీడీ సహకారంతో అటవీ ప్రాంతంలో మొత్తం ఎన్ని చిరుతలు, ఎలుగుబంట్లు, రేసుకుక్కలు ఉన్నాయో తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అందు కోసం సీసీ కెమెరాలు, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

అప్రమత్తమైన భక్తులు

చిరుత దాడుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు గుంపులు గుంపులుగా వెళుతున్నారు. చిన్న పిల్లల తల్లిదండ్రులు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చీకటి పడ్డాక నడక మార్గంలో వెళ్లటానికి భక్తులు ఇష్టపడటం లేదు.

స్పందనకు 61 ఫిర్యాదులు


ఫిర్యాదును స్వీకరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 61 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు నేరుగా హాజరై ఎస్పీకి సమస్యలను వివరించారు. ఆ ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసి, వారికి ఎలాంటి న్యాయం చేశారో తమ కార్యాలయంలో తెలపాలని ఎస్పీ ఆదేశించారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందాయి.

అభివృద్ధే మా అజెండా

- ఓట్ల కోసం చేసే విమర్శలను పట్టించుకోం
- ప్రజల ఆశీస్సులతోనే విజయాలు సాధిస్తున్నాం
- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, వేదికపై మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్ తదితరులు

పుంగనూరు : కన్నతల్లిలాంటి పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్నామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలో పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్రమణ్యం యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ యాదవ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతోనే తమ కుటుంబానికి ఇన్ని విజయాలు దక్కుతున్నాయన్నారు. తమను ఈ స్థాయికి తీసుకొచ్చిన పుంగనూరు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉన్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రతి సారీ ఎన్నికల సమయంలో ఎవరో ఒకరు వచ్చి ఓట్లకోసం గుప్పించే విమర్శలను పట్టించుకోమని వెల్లడించారు. తమ కుటుంబానికి ఉన్నత పదవులు అందించేందుకు ప్రతి ఎన్నికల్లో గెలిపించిన ప్రజల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వివరించారు. సమావేశంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు జ్ఞానప్రసన్న, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పాల్గొన్నారు.

ఆత్మీయ సభ సక్సెస్

వైఎస్సార్‌సీపీ యాదవ ఆత్మీయ సమావేశానికి పెద్దసంఖ్యలో యాదవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ యాదవులకు రాజకీయ పదవులు ఇచ్చిన ముఖ్యమంత్రి జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబం బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందన్నారు. 28 ఏళ్లకే తనను ఎమ్మెల్యేను చేసిన ఘనత పెద్దిరెడ్డి కుటుంబానిదేనని కొనియాడారు. యాదవ సంఘం కార్పోరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఒక బఫూన్ వచ్చి కులంపేరుతో మోసగిస్తున్నాడని ఆరోపించారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తిరుమల గొల్ల సన్నిధి సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని తెలిపారు. 800 దేశీయ ఆవులను మిథున్‌రెడ్డి పెంచుతున్నారని, దీంతో యాదవులపై ఉన్న ప్రేమ తెలుస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో యాదవ సంఘ ప్రతినిధులు వాణీలక్ష్మి, చంద్రారెడ్డి యాదవ్, నరసింహులు, జయకుమార్ యాదవ్, సుబ్బన్న, రమణ, శంకరప్ప, నారాయణరెడ్డి, పాపిరెడ్డి, పురుషోత్తం , గౌరమ్మ, గంగిరెడ్డి, ప్రభాకర్ యాదవ్, హరి యాదవ్, రెడ్డెప్ప యాదవ్, నరసింహారెడ్డి యాదవ్ పాల్గొన్నారు.


తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,700
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,451

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,200
రిటైల్ వెండి గ్రాము	రూ.74.20

తిరుమల ఘాట్‌లో ప్రమాదం


ప్రమాదానికి గురైన వాహనం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్‌లో ఆదివారం ప్రమాదం చోటుచేసుకుంది. కర్ణాటకకు చెందిన కారు అదుపుతప్పి 17వ కిలోమీటర్ వద్ద పిట్టగోడను ఢీకొంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలుకాలేదు. వెంటనే ఘాట్ రోడ్డు సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యత


అర్జీలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో స్పందనకు వచ్చే అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఇన్‌చార్జి కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలకు తప్పకుండా పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. డీఆర్వో కోదండరామిరెడ్డి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, భాస్కర్‌నాయుడు స్పందనలో వచ్చే అర్జీలను స్వీకరించారు.

స్పందనకు వచ్చిన అర్జీలు 108

స్పందనలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 73 అర్జీలు అందాయి. పోలీస్ శాఖకు 9, డీఆర్‌డీఏ 3, పంచాయితీ రాజ్ 2, ఎంపీడీవో 1, ఆరోగ్యశ్రీ 1, విద్యుత్‌శాఖ 2, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 1, సబ్ రిజిస్ట్రార్ 2, జిల్లా వ్యవసాయశాఖకు 1, ఇరిగేషన్‌కు 3, మున్సిపల్ కమిషనర్‌కు 1, వైద్యశాఖకు 2, డ్వామా పీడీకి 3, గృహ నిర్మాణశాఖకు 2, మత్స్య శాఖకు 2 మొత్తం 108 అర్జీలను అధికారులు అందుకున్నారు.

విరివిగా రుణాలు ఇవ్వాలి

ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వాలని, రుణాలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఇన్‌చార్జి కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సలహా కమిటీ(డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ(డీఎల్‌ఆర్‌సీ) సమావేశాలు నిర్వహించారు. డీకే బాలాజీ మాట్లాడుతూ అర్హులందరికీ రుణాలు అందజేయాలని బ్యాంకర్లను సూచించారు. విద్యతోపాటు వ్యవసాయం వాటి అనుబంధ విభాగాలకు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఎల్డీఎం సుభాష్ మాట్లాడుతూ విద్యారుణాల్లో మాత్రమే పురోగతి కనిపిస్తోందని పేర్కొన్నారు. 2023–24 లక్ష్యాల సాధన దిశగా బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఆర్‌బీఐ ఎల్డీవో పూర్ణిమ, యూనియన్ బ్యాంక్ అధికారి శ్రీనివాస, నాబార్డ్ డీఎం సునీల్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జయకుమార్, ఇండియన్ బ్యాంక్ డీజేడీఎం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్మికుడు మృతి


నరేంద్ర (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విద్యుదాఘాతంతో పారిశుధ్య కార్మికుడు మృతి చెందాడు. ఆలయంలో సోమవారం శుద్ధి చేస్తుండగా వాటర్ గన్‌తో నీటిని పడుతున్నాడు. ఈ క్రమంలో అది షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. హుటాహుటిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సందర్శించి నివాళి అర్పించారు. తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. అందరితో చర్చించి ఆ కుటుంబానికి మరింత సాయంచేసి ఆదుకుంటామన్నారు.

16న రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక

చిల్లకూరు: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలను ఈ నెల 18 నుంచి ఒంగోలులో నిర్వహించనున్నట్లు నెల్లూరు జిల్లా హ్యాండ్ బాల్ కార్యదర్శి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ శ్రీరేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి నెల్లూరు జట్టును ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ఇందుకు గాను చిల్లకూరులోని గురుకుల బాలుర పాఠశాలలో ఈ నెల 16వ తేదీ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ జట్టును ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ జిరాక్స్, జనన ధ్రువీకరణ పత్రం తీసుకు రావాలని కోరారు.

పంద్రాగస్టు రిహార్సల్స్ పరిశీలన


పోలీస్ పరేడ్ గ్రౌండ్లో స్వాతంత్ర్య దినోత్సవ రిహార్సల్స్‌లో సిబ్బంది

తిరుపతి క్రైం: స్వాతంత్ర్య వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబయింది. జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి స్వాతంత్ర్య వేడుకల రిహార్సల్స్‌ను సోమవారం పరిశీలించారు. కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్‌ను పరిశీలించి పలు సూచనలు తెలిపారు. అనంతరం జెండా వందనం చేశారు. మంగళవారం నిర్వహించనున్న పంద్రాగస్టు వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కవాతు నిర్వహించాలని తెలిపారు. డాగ్ స్క్వాడ్ విన్యాసాలను తిలకించారు.

100 అడుగుల త్రివర్ణంతో ర్యాలీ


100 అడుగుల జెండాను ప్రదర్శిస్తున్న చిన్నారులు

రాపూరు: స్వాతంత్ర్య సంబరాల్లో భాగంగా సోమవారం రాపూరులోని జెమ్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు 100 అడుగుల జాతీయ జెండాను పురవీధుల్లో ప్రదర్శించారు. చిన్నారులు స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణతో జాతీయ జెండాను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాసులు, జిలాని, సీఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో చిరుత కలకలం

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విభాగం సమీపంలోని పొదల్లో చిరుత సోమవారం రాత్రి సంచరించడం విద్యార్థుల కంటపడింది. వెంటనే విద్యార్థులు కేకలు వేయడంతో వేదిక్ యూనివర్సిటీ సమీపంలోని అటవీ ప్రాంతం వైపు వెళ్లిందని ఇంజినీరింగ్ హాస్టల్ విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ సిబ్బంది సమీప ప్రాంతానికి చేరుకుని శబ్దాలు చేస్తూ పట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ హాస్టల్ సమీపం గ్రౌండ్‌లోని అటవీ ప్రాంతంలో చిరుత తారసపడిందని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. అనంతరం అక్కడి విద్యార్థులకు చిరుత సంచరించే ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో తిరగరాదని సూచించారు.

కాలుజారి పడి యువకుడు మృతి


మృతి చెందిన సందీప్‌కుమార్

శ్రీకాళహస్తి: మరుగుదొడ్డిలో యువకుడు కాలుజారి పడి మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన సందీప్‌కుమార్(26) సొంత పనుల నిమిత్తం సోమవారం శ్రీకాళహస్తికి వచ్చాడు. ఆర్టీసీ బస్టాండులోని మరుగుదొడ్డిలోకి వెళ్లి కాలుజారి పడ్డాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు


6 వికెట్లు తీసిన హరివరణ్


4 వికెట్లు తీసిన ప్రకాష్

వెంకటగిరి రూరల్ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తారకరామ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సౌత్‌జోన్ అండర్–16 క్రికెట్ పోటీల్లో భాగంగా సోమవారం అనంతపురం–చిత్తూరు, కడప–నెల్లూరు జట్ల మధ్య క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గ్రౌండ్–1లో అనంతపురం – చిత్తూరు జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో అనంతపురం జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన జట్టు 40.4 ఓవర్లకు 138 పరుగులు చేసింది. ఈ జట్టులో భువనేశ్వర్ 31 పరుగులు తీయగా చిత్తూరు జట్టు బౌలింగ్‌లో ప్రకాష్ 4, సోహాన్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 47 ఓవర్లకు 133 పరుగులు తీసింది. ఈ జట్టులో నవీన్‌ధీర్ 58, ప్రసాద్ 45 పరుగులు తీసి నాటౌట్‌గా నిలిచారు. అనంతపురం జట్టుకన్నా చిత్తూరు జట్టు 5 పరుగుల తేడాలో వెనుకంజలో ఉంది.

గ్రౌండ్–2లో...

కడప–నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 50 ఓవర్లకు 199 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టులో గురువిఘేష్ 66, నాగకొల్లప్పా 35 పరుగులు తీశారు. నెల్లూరు జట్టు బౌలింగ్ విభాగంలో హరివరణ్ 6 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 43 ఓవర్లకు 125 పరుగులు చేసి 1 వికెట్ కోల్పోయింది. ఈ జట్టులో ప్రసాద్ 64, విష్ణువిశాల్ 35 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. కడప జట్టుకంటే నెల్లూరు జట్టు 54 పరుగులు తేడాతో వెనుకంజలో ఉంది. ఈ మ్యాచ్‌ల కో–స్కోరర్‌గా సీడీ శ్రీనివాసులరెడ్డి వ్యవహరించారు.